నమస్తే తెలంగాణ

వికారాబాద్

హైదరాబాద్, మంగళవారం 6 మే 2025 VIKARABAD


## గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్



సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో సోమవారం రాత్రి గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి 9 గంటల వరకు షేక్‌పేటలో 1.0 సెం.మీ, గచ్చిబౌలిలో 6 మి.మీలు, యూసుఫ్‌గూడలో 5 మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశమున్నందున ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. వర్షంతో పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు నిలిచి ట్రాఫిక్ జాం అయింది.



ఇబ్రహీంపట్నంలో గర్భంలో కవలలు మృతి చెందిన ఘటనలో విచారణ జరిపి విజయలక్ష్మి ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు IVవ పేజీలో

# గోపన్‌పల్లిపై భూసేకరణ పిడుగు!

**హైదరాబాద్ మహా నగరంలో వెస్ట్ జోన్... రియల్-నిర్మాణ రంగాలకు స్వర్గధామం. అందునా ఐటీ కారిడార్‌ను ఆనుకొని ఉన్న భూములంటే బంగారం కంటే విలువైనవి. మరి... అలాంటి భూముల్లో దశాబ్దాల కిందట ప్లాట్లు కొనుగోలు చేసినవారున్నారు. కొందరు పైసా పైసా కూడబెట్టుకొని ఇండ్లు నిర్మించుకున్న వాళ్లూ ఉన్నారు. మరికొందరు భవిష్యత్తు కోసం భూముల్ని కొనుగోలు చేశారు. ఇప్పుడు ఆ భూముల్లో ఒక్కసారిగా 'భూసేకరణ' పిడుగుపడింది. ఒకటీ అరా కాదు! ఏకంగా 439 ఎకరాల్లో అధికారికంగా లావాదేవీలు నిలిచిపోయాయి. రేపో మాపో ఆ భూములన్నీ నిషేధిత జాబితాలోకి ఎక్కనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూముల్ని అధికారికంగా సేకరించి... టీజీఐఐసీకి అప్పగించేందుకు కసరత్తు మొదలెట్టింది. ఇప్పటికే సర్వేనంబర్లతో సహా భూముల్ని గుర్తించిన తహసీల్దార్ నివేదిక మేరకు తాత్కాలికంగా రిజిస్ట్రేషన్లను నిలిపివేసినట్లు ఆ శాఖ చెబుతున్నది. కలెక్టర్ అనుమతి ఇచ్చిన వెంటనే శాశ్వతంగా వాటిని నిషేధిత జాబితాలో చేరుస్తామంటున్నారు.**

**ఇదీ...**

**రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 127-173, 263-286 పరిధిలోని 439.15 ఎకరాల్లోని భూముల తాజా పరిస్థితి. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అతి సమీపంలో ఉన్న ఈ అత్యంత విలువైన భూముల్లో ఐటీ పార్కుతో పాటు ఐటీ రంగ ప్రాజెక్టుల కోసం భూముల్ని కేటాయించేందుకుగాను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ భూములను సేకరించేందుకు నిర్ణయించింది. భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చేందుకుగాను అంతర్గతంగా కసరత్తు జరుగుతుంది.**

### 71 సర్వేనంబర్లలోని 439.15 ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేత.. దశాబ్దాల కిందట లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్యులు

- 2004లో ఫార్ములా వన్ కోసం వెయ్యి ఎకరాల సేకరణకు చంద్రబాబు నిర్ణయం
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి రాగానే రద్దైన భూసేకరణ నోటిఫికేషన్
- 438 ఎకరాల్లో ఐటీ పార్కు ఏర్పాటుకు నిర్ణయించి నోటిఫికేషన్ జారీ
- దీనిని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన రంగనాథ్‌నగర్‌వాసులు
- గతేడాది వచ్చిన తీర్పును ఆసరాగా చేసుకొని తాజాగా భూసేకరణకు కసరత్తు
- టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఐటీ పార్కు ఏర్పాటుకు రేవంత్ సర్కారు నిర్ణయం
- తహసీల్దార్ లేఖతో తాత్కాలికంగా నిలిచిన భూముల లావాదేవీలు
- కలెక్టర్ అనుమతిస్తే ఆ భూముల్ని నిషేధిత జాబితాలో చేరుస్తాం : సబ్ రిజిస్ట్రార్




**సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/శేరిలింగంపల్లి/మణికొండ, మే 5:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు హయాంలో తెరపైకొచ్చిన భూసేకరణ ప్రక్రియను తాజాగా రేవంత్ సర్కారు పూర్తి చేసేందుకు రంగం సిద్ధమవుతుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లిలో ఏకంగా వెయ్యి ఎకరాలను సేకరించేందుకు సుమారు 2003-04 ప్రాంతంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్ములా వన్ కోసం ఈ భూసేకరణ చేపడుతున్నట్లు అప్పట్లో బాబు సర్కారు ప్రకటించినట్లు తెలిసింది. ఆ మేరకు భూసేకరణ నోటిఫికేషన్ కూడా జారీ అయిందని పలువురు చెబుతున్నారు. అయితే 2004 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు సర్కారు పోయి... వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ మేరకు చంద్రబాబు హయాంలో జారీ అయిన భూసేకరణ, ఇతరత్రా భూములకు సంబంధించిన ఒప్పందాలను వైఎస్ రద్దు చేశారు. అందులో భాగంగా వెయ్యి ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్ కూడా రద్దు చేశారు. అందులో ఫార్ములా వన్ కాకుండా ఐటీ పరిశ్రమల ఏర్పాటు కోసం ఆ భూముల్ని సేకరించాలని వైఎస్ నిర్ణయించారు. అయితే గోపన్‌పల్లి పరిధిలో వెయ్యి ఎకరాలు కాకుండా 438 ఎకరాల భూమి లభ్యతను గుర్తించినట్లు తెలిసింది. ఆ మేరకు 2005లో గోపన్‌పల్లి గ్రామ పరిధిలోని పలు సర్వేనంబర్లలో (71 సర్వేనెంబర్లు) 438.15 ఎకరాల సేకరణకు పలు నోటిఫికేషన్లు జారీ చేశారు. అందులో అప్పటికే లేఅవుట్లు అయి ప్లాట్లు కొనుగోలు చేయడంతో రంగనాథనగర్ కాలనీవాసులు హైకోర్టును ఆశ్రయించారు. తాము పైసా పైసా కూడబెట్టుకొని ప్లాట్లు కొనుగోలు చేశామని, దానిని ప్రభుత్వం తీసుకుంటే తామేం కావాలని, న్యాయం చేయాలని కోర్టును అభ్యర్థించారు. అయితే హైకోర్టు వారి విజ్ఞప్తిని తోసిపుచ్చి కాలనీవాసుల పిటిషన్‌ను కొట్టివేసింది. అనంతరం కాలనీవాసులు సుప్రీంకోర్టును ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని కోరారు. అప్పటినుంచి ఆ భూసేకరణ నోటిఫికేషన్‌పై న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లోనే ఉంది. తీరా... రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల తర్వాత అంటే 2024 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు ఈ నోటిఫికేషన్‌పై తీర్పునిచ్చింది. పాత నోటిఫికేషన్ చెల్లదని, ప్రభుత్వానికి అవసరమైతే కొత్తగా భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చుకోవచ్చని సూచించింది. దాదాపు రెండు దశాబ్దాల కిందటి కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆసరాగా చేసుకొని రేవంత్ ప్రభుత్వం భారీ భూసేకరణకు రంగం సిద్ధం చేసింది.

#### విలువ పెరిగి.. కాలనీలుగా ఏర్పడి..

వైఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అంటే 2005లో గోపన్‌పల్లి ప్రాంతం నగరానికి దూరంగా ఉండేది. అయినప్పటికీ భవిష్యత్తులో ఆధారంగా ఉంటాయనే నమ్మకంతో సామాన్యులు వేలాది మంది అక్కడ లేఅవుట్లల్లో ప్లాట్లు కొన్నారు. కాలక్రమేణా సామాన్యులు వేలాది మంది పైసా పైసా కూడబెట్టుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ భూముల్లో రంగనాథనగర్, బృందావన్ కాలనీ, ద్వారకాపురి కాలనీ, దుర్గాపూర్ కాలనీలు కూడా ఏర్పడ్డాయి. ఇంకా చాలామంది తమ ప్లాట్ల చుట్టూ ప్రహరీలు నిర్మించుకున్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ భూములను సేకరించేందుకు కసరత్తు మొదలుపెట్టింది.

మిగతా IVవ పేజీలో..



GOVERNMENT OF TELANGANA
(REVENUE DEPARTMENT)

From
Sri. K. Venka Reddy,
The Dy. Collector & Tahsildar,
Serilingampally Mandal.

To
The District Collector,
Rangareddy District.

Lr.No.B/ 1342/2025 Dt. 03.03.2025

Sir,

Sub: Government Lands - Rangareddy District - Serilingampally Mandal - Gopanpally Village - The lands admeasuring Ac. 439-15 gts in SyNo. 127 to 173 and 263 to 186 proposed for land acquisition for the purpose of Establishment of IT Park & Related Projects by TGIIC Ltd - Inclusion of lands under Clause (a) of sub section (1) of Section 22-A of the Registration Act, 1908 - Requested - Reg.

Ref: Instructions of the District Collector, Rangareddy District Dated. .02.2025

****

Kind attention is invited to the reference cited and it is submitted that the lands in Survey No. 127 to 173 and 263 to 286 total admeasuring Ac. 439-15 Gts situated at Gopanpally Village, Serilingampally Mandal have been proposed for Land Acquisition for the purpose of Establishment of IT Park & Related Projects by TGIIC Ltd.

Keeping view of the above, it is requested kindly arrange to issue necessary to the concerned to include the above lands in list of Prohibitory property under Clause (a) of sub section (1) of Section 22-A of the Registration Act, 1908, as per rules in force.

A list of above lands is appended to this letter, for taking necessary action in the matter.

Yours faithfully,

Encl: (As above)

Dy. Collector & Tahsildar,
Serilingampally Mandal

Copy submitted to the District Registrar, Rangareddy District for favour of kind information and necessary action.

439 ఎకరాల్లో రిజిస్ట్రేషన్లను నిలిపేస్తూ జారీ అయిన ఉత్తర్వులు

#### పొంతనలేని తహసీల్దార్ ప్రకటన

గోపన్‌పల్లిలో 483.15 ఎకరాల భూసేకరణకు సంబంధించి శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి పేరిట సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదలైంది. ఆ భూములను 2005లో సేకరించేందుకు నిర్ణయించి, పలు నెంబర్లతో నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆ మేరకు అప్పట్లోనే వాటిని నిషేధిత జాబితాలోకి చేర్చారన్నారు. కానీ ఇప్పుడు కొత్తగా ఏమీ నిషేధిత జాబితాలో చేర్చడంలేదని అన్నారు. కానీ సదరు తహసీల్దార్ వెంకారెడ్డి గత మార్చి మూడో తేదీన జిల్లా కలెక్టర్‌కు లేఖ రాస్తూ... ఈ సర్వేనెంబర్లలోని భూములను రిజిస్ట్రేషన్ల చట్టం-1908లోని సెక్షన్ 22ఎ(1) కింద నిషేధిత జాబితాలో చేర్చాలని కోరారు. ఆ మేరకు జాబితాను జత చేసినట్లు అందులో పేర్కొన్నారు. మరి... 2005లోనే నిషేధిత జాబితాలో ఉంటే 2025, మార్చిలో నిషేధిత జాబితాలో చేర్చాలంటూ ఎందుకు లేఖ రాశారో సదరు తహసీల్దార్‌కే తెలియాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

#### కలెక్టర్‌కు లేఖ రాశాం

**గోపనపల్లి పరిధిలోని పలు సర్వేనెంబర్లల్లో ఐటీ పార్కు భూసేకరణ నిమిత్తం శేరిలింగంపల్లి తహసిల్దార్ ఇచ్చిన నివేదిక మాకు అందింది. అది జిల్లా కలెక్టర్ కు రాసినది. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి 22ఎ క్లాస్ కింద నిషేధిత జాబితా ఉత్తర్వులు ఇంకా అందలేదు. ఈ విషయంపై కలెక్టర్‌కు లేఖ రాశాం. అప్పటివరకు తాత్కాలికంగా సదరు స్థలాల రిజిస్ట్రేషన్లను నిలిపివేశాం.**

**- అన్వేషిత, వట్టినాగులపల్లి సబ్ రిజిస్ట్రార్**

---

## సీఎం ఆదేశించినా..
## 126 రోజుల జాప్యం

**నత్తనడకన మెట్రో ఫేస్-2 పార్ట్ బీ డీపీఆర్ రూపకల్పన**


**తుది దశకు చేరిందంటూ మెట్రో వెల్లడి**

**ఆమోదం వచ్చేదెప్పుడని ప్రశ్నిస్తున్న నార్త్ సిటీ వాసులు**

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ) : డీపీఆర్ త్వరగా పూర్తి చేయాలి. ప్రాజెక్టు పనులు శరవేగంగా మొదలు పెట్టాలంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన బుట్టదాఖలైంది. వీలైనంత త్వరగా మెట్రో ఫేస్-2 పార్ట్ బీ విస్తరణ సమగ్ర ప్రాజెక్టు నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించినా ఇప్పటికీ సంబంధిత శాఖకు చేరలేదు. నార్త్ సిటీ ప్రాంతానికి మెట్రోలైన్‌ను విస్తరిస్తామని స్వయంగా సీఎం ప్రకటించి 126 రోజులు గడిచినా.. కార్యరూపంలోకి రాలేదు. మూడు నెలల్లో డీపీఆర్ పూర్తి చేయాలని ఆదేశిస్తే... తుది మెరుగుల పేరిట రోజులు గడుస్తున్నాయే తప్పా... కంటికి కనిపించలేదు. ప్రాజెక్టు నిర్మాణం దేవుడెరుగు, కనీసం డీపీఆర్ అయితే సిద్ధం చేయకపోవడం ఆ ప్రాంత వాసులను కలవరపెడుతున్నది. ముఖ్యమంత్రి ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా, ఇంకా తుది దశలో ఉందనే హెచ్ఎంఎల్ ప్రకటించడం తమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడమేనని వాపోతున్నారు.

#### ప్రాజెక్టు మనుగడపై అనుమానాలు..

నార్త్ సిటీ మెట్రో నిర్మాణంపై కొంతకాలంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందులో డీపీఆర్ తయారీకి రోజులు గడుస్తున్నాయే తప్ప.. ఫలితం లేదు. ఓవైపు ఎలివేటెడ్ కారిడార్, మెట్రో మార్గాలను వేర్వేరుగా నిర్మించాలనే ప్రతిపాదనలు తెరమీదకు రావడం, ఇప్పటికీ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు భూసేకరణ పూర్తి కాకపోవడం, ప్యారడైజ్ నుంచి వెళ్లాల్సిన మార్గాన్ని జేబీఎస్‌కు మార్చడం ఇలా నార్త్ సిటీ విషయంలో ఇటీవల జరిగిన అంశాలన్నీ ప్రాజెక్టు మనుగడపై అనుమానాలను పెంచుతున్నాయి. ఇక ప్రభుత్వం కూడా నార్త్ సిటీ మెట్రోపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ప్రాజెక్టును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. అయితే హెచ్ఎంఎల్ మాత్రం ఈ అంశాన్ని దాటవేసేలా, డీపీఆర్ తుది దశలో ఉందని, పలు మార్పులు, చేర్పులు జరుగుతున్నాయని, త్వరలోనే డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని ప్రకటిస్తుందే తప్ప.. ఇప్పటివరకు ఈ అంశాన్ని తేల్చలేకపోతున్నది.



---



అకాల వర్షానికి నేలరాలిన ధాన్యం గింజలు

**అకాల వర్షాలతో నేలరాలిన చేతికొచ్చిన పంటలు**

## రైతన్న కష్టం మట్టి పాలు..

- వరి, మామిడి, కూరగాయల పంటలకు వాటిల్లిన నష్టం
- పంట నష్టాన్ని అంచనా వేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయిలో పర్యటించకుండా ఉన్నతాధికారులకు నివేదికను పంపించడంపై అన్నదాతల ఆగ్రహం

రంగారెడ్డి, మే 5 (నమస్తే తెలంగాణ) : జిల్లా లో గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అపార నష్టం సంబవించింది. వడగండ్ల వాన, ఈదురు గాలులతో వరి, మామి డి, మొక్కజొన్న, ఇతర కూరగాయల పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించిన రైతులకు పంట చేతికొందే సమ యంలో అకాల వర్షాలతో నోటికాడి బుక్క మట్టిపాలైంది. దీంతో జిల్లాలోని 27 మండలాలు, పలు మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున నష్టం జరిగింది. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులను ఆదేశించగా .. క్షేత్రస్థాయిలో వారు సరిగ్గా పంట నష్టాన్ని అంచనా వేయలేకపోయారని రైతులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లో పర్యటించకుండా ఎక్కడో కూర్చుని గుడ్డిగా పంట లు నష్టపోయినట్లు రానుకున్నారని.. అధికారుల లెక్కలు పొంతనలేకుండా ఉన్నాయని పేర్కొంటున్నారు.

#### లక్షల ఎకరాల్లో పంట నష్టం.. వేలల్లో అంచనా..

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, షాద్‌నగర్, మహేశ్వరం, ఆమనగల్లు, రాజేంద్రనగర్ డివిజన్లలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి పెద్ద మొత్తంలో పంటనష్టం జరిగింది. అధికారుల లెక్కలు మాత్రం షాద్‌నగర్ డివిజన్‌లో 561 ఎకరాలు, ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 228 ఎకరాల్లో 141 మంది రైతుల పంటలు, ఆమనగల్లులో 161 ఎకరాలు, కడ్తాల్‌లో 83 ఎకరాలు, చేవెళ్ల డివిజన్‌లో 20 ఎకరాలు మాత్రమే నష్టపోయినట్లు అంచనా వేశారు. అలాగే, మహేశ్వరం డివిజన్‌లో పెద్ద ఎత్తున పంటనష్టం జరిగినా 250 ఎకరాల్లోనే జరిగినట్లు నివేదికను పై అధికారులకు అందజేశారు. మంచాల, యాచారం, మాడ్గుల, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి, షాబాద్, షాద్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం తదితర మండలాల్లో ఏప్రిల్, మే నెలల్లో కురిసిన వర్షాలతో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగింది. కానీ, అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో పర్యటించకుండా ఎక్కడో కూర్చుని పై అధికారులకు నివేదికను అందించారని.. వారి లెక్క లు పొం తన లేకుండా ఉన్నాయని పలు గ్రా మాల రై తులు మండిపడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారాన్ని చెల్లించాలని కోరుతున్నారు.

#### రైతులకు తీరని నష్టం..

గత నెలలో కురిసిన అకాల వర్షానికి మామిడి తోటలకు అపారనష్టం సంభవించింది. గాలివానకు అనేక ప్రాంతాల్లో కాయలు నేలరాలాయి. వాటిని మార్కెట్‌కు తీసుకెళ్తే సగం ధర కూడా రాలేదు. అలాగే, జిల్లాలో టమాట, వంకాయ, బెండకాయ తదితర కూరగాయల పంటలకు కూడా తీరని నష్టం జరిగింది.

#### నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలి..

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు భారీ మొత్తంలో నష్టపోయాయి. అధికారులు నష్టపోయిన పంటల వివరాలను సేకరించి..ప్రభుత్వానికి అందించి..నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. దాదాపుగా వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు అధికంగా నష్టం జరిగింది.



**-రమేశ్‌నాయక్, యువ రైతు, ఆమనగల్లు**

---



ధాన్యాన్ని కాంటా చేయిస్తున్న వ్యవసాయ శాఖ అధికారిణి

**నమస్తే ఎఫెక్ట్**

## కొనుగోళ్లు షురూ..

బషీరాబాద్, మే 5 : ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని.. 'కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం..' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారు లు స్పందించారు. సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి అనిత ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు తీసుకొచ్చిన వడ్లను కాంటా చేయించారు. దీంతో గత పదిహేను రోజులుగా కొనుగోలు కేంద్రం వద్దే పడిగాపులు కాసిన రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కూలీల సంఖ్య పెంచి త్వరగా ధాన్యాన్ని సేకరించాలని రైతులు అధికారులను కోరారు.

## 7 నుంచి సమ్మెలోకి ఆర్టీసీ ఉద్యోగులు

చిక్కడపల్లి, మే 5: ఆర్టీసీ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అమలు చేయకపోవడంతో 7 నుంచి సమ్మె నిర్వహించనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసీ కళాభవన్ నుంచి బస్‌భవన్ వరకు కార్మిక కవాతు నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి, యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్ హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 17 నెలలు దాటుతున్నా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయలేదని, సమస్యలను పరిష్కరించలేదని మండిపడ్డారు.

'ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా.. ఇప్పటివరకు ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు గత సీఎం కేసీఆర్ చర్యలు తీసుకున్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం దానిని ముందుకు తీసుకెళ్లడం లేదు'. అని ఆర్టీసీ ఉద్యోగులు భూమయ్య, నాగరాజ్ అన్నారు.




కార్మిక కవాతు నిర్వహిస్తున్న టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు